ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ:16-7-2025 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఈ మధ్యాహ్నం ఢిల్లీలో సమావేశం జరుగుతుంది.

2. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే స్టీల్ బ్యాంకును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ రేపు ప్రారంభిస్తారు.

**3.** వెనుకబడిన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రవాణ శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా వెల్లడించారు.

4. ఈరోజు రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

బనకచర్ల

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ అంశాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన సమావేశం ఈ మధ్యాహ్నం జరగనుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు , నీటి పారుదల శాఖ మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది.

ముఖ్యంగా గోదావరీ - బనకచర్ల ప్రాజెక్టు అంశంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో, బనక చర్ల అంశాన్ని అజెండాలో చేర్చడంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు జలశక్తి శాఖకు ఇప్పటికే లేఖ రాసింది. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు లేకపోవడం , ప్రస్తుత చట్టాలు , ట్రిబ్యునల్ తీర్పుల పరిధిలో లేకపోవడంతో, దానిపై చర్చించాల్సిన అవసరం లేదని తెలంగాణ తన అభిప్రాయాన్ని తెలియజేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...

సౌండ్ బైట్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ఇలా ఉండగా , రాయలసీమ ప్రాంతం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే పోలవరం- బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెబుతోంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ...

సౌండ్ బైట్: ఏపీ సీఎం చంద్రబాబు

డెస్క్

**గవర్నర్ పర్యటన**

సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే స్టీల్ బ్యాంకును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ రేపు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొంటారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో వీటి నిర్వహణ కొనసాగించనున్నారు. గవర్నర్ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హైమవతి అధికారులను ఆదేశించారు.

పిటిసి, సిద్దిపేట

**కేంద్రమంత్రి హర్ష మల్హోత్రా**

వెనుకబడిన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రవాణా శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా వెల్లడించారు. ఆసిఫాబాద్ జిల్లాలో రెండో రోజు పర్యటనలో

భాగంగా తిర్యాని ఆకాంక్షిత బ్లాక్ లో పర్యటించి గిరిజనులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లాలో రహదారుల అవసరం ఎంతో ఉందని వాటి అభివృద్ధి కోసం తమ ప్రభుత్వ హయాంలో చేయాల్సిన కృషి చేస్తామని తెలిపారు. గిరిజనులు ప్రభుత్వ అందిస్తున్న సహకారాలు పొంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

పిటిసి, ఆసిఫాబాద్

**నాబార్డ్ ఫౌండేషన్ డే**

వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలకు బ్యాంకుల నుంచి మరింత సాయం అందాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిన్న జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర పోషించిందని , గ్రామీణ అభివృద్ధికి కృషి చేసిందని ప్రశంసించారు. రాష్ట్రంలో రైతులకు బ్యాంకులు పంట రుణసాయం పెంచాలని , వ్యవసాయానుబంధ రంగాలను ప్రోత్సహించాలని సూచించారు. బ్యాంకులు నాబార్డును ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

డెస్క్

**బ్రేక్**

**నల్లగొండ –ఐఐటీ మద్రాస్**

నల్లగొండ జిల్లాల్లోని గ్రామాల్లో తాగునీటి వృథాను అరికట్టేందుకు ముందుకు వచ్చిన మద్రాస్ ఐఐటీ బృందానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని నల్లగొండ కలెక్టర్ త్రిపాఠి అధికారులకు సూచించారు. మద్రాస్ ఐఐటీ బృందం పైలట్ పద్ధతిన నల్గొండలోని 11 మండలాల్లో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో నీటి నిర్వహణను అమలు చేయనుంది. ఈరోజు జిల్లా కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో మద్రాస్ ఐఐటీ బృందం తమ ప్రాజెక్టులోని

వివరాలను వెల్లడించింది. ప్రత్యేకంగా రూపొందించిన ఐట్యాంక్ యాప్ ద్వారా గ్రామాల్లో నీరు వృథా కాకుండా అరికట్టవచ్చని తెలిపింది.

పిటిసి, నల్గొండ

**ఇన్నోవేషస్ మారథాస్**

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆన్లైన్ విధానంలో నిర్వహించిన జాతీయ స్థాయి స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2025 వైజ్ఞానిక ప్రదర్శనల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంత్రిత్వ శాఖ ప్రకటించిన అత్యుత్తమ 27 ఆవిష్కరణల జాబితాలో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట్ ప్రభుత్వ పాఠశాల 10 వ తరగతి విద్యార్థినిలు తయారు చేసిన స్మార్ట్ వాష్ బేసిన్ అనే ఆవిష్కరణ చోటు దక్కించుకుంది.

ఈ సందర్భంగా విద్యార్థిని ఈరబోయిన శ్రీ చైత్ర ఆకాశవాణితో మాట్లాడుతూ......

బైట్: శ్రీ చైత్ర

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**ఉప్పల్ ఫ్లై ఓవర్**

హైదరాబాద్ లోని ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు 8 కిలో మీటర్ల మేరకు నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ ఉదయం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 8 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఫ్లై ఓవర్ పనుల్లో ఆర్థిక వనరులు, ఇతర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు.

పీటీసీ, HYD

**మహబూబ్ నగర్ – చిరుత సంచారం**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేట , గుర్రం గుట్ట పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం ఉండాలని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశించారు. జిల్లా ఎస్పీ జానకి అటవీ పోలీస్ మున్సిపల్ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలను కలెక్టర్ ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయేంద్ర బోయి మాట్లాడుతూ...

Byte: జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

పిటిసి, మహబూబ్ నగర్

**వాతావరణం**

ఈరోజు రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. అన్ని జిల్లాల్లోనూ గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. రానున్న రెండు రోజుల్లోనూ ఇదే పరిస్థితి ఉండవచ్చని సూచించింది.

పీఎన్

**వలిగొండ కాలువ**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ మండలంలోని గోకారం చెరువు వద్ద సాగుతున్న ధర్మారెడ్డిపల్లి కాలువ పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధికారులు, రైతులతో కలిసి ఈరోజు పరిశీలించారు. కాలువ పనులు ఆలస్యం కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పంట సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కాలువ పనులను తక్షణమే వేగవంతం చేసి , రైతుల పంట పొలాలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పిటిసి, యాదాద్రి భువనగిరి

**ప్రభంజస్ కుమార్**

కేంద్ర సమాచార , ప్రసార శాఖలో ఐఐఎస్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ పై. ప్రభంజన్ కుమార్ ఈ ఉదయం మరణించారు. గత కొద్దికాలం గా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. మంత్రిత్వ శాఖకు చెందిన పలు విబాగాలలో క్షేత్ర సమాచార అధికారిగా , ఆకాశవాణి వార్తా విభాగంలో సంపాదకునిగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. 2014 నుంచి తెలంగాణ విశ్వ విద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా, ప్రొఫెసర్ గా సేవలు అందించారు.

DESK